


కథ

గంగాధర్ వడ్లమన్నాటి

# దయచేసి నిశ్శబ్దం

**కా**లింగ్ బెల్ సౌండ్, సారీ.. కాలింగ్ బెల్ వైబ్రేషన్ సౌండ్ నెమ్మదిగా భీబ్ అంటూ మోగింది.

"వెళ్లి చూడు ఎవరొచ్చారో" అంటూ కళ్లతో సైగ చేశాడు సైలేష్.

'అలాగే' అన్నట్టు తలూపి, నెమ్మదిగా వెళ్లి, తలుపుని బహు నెమ్మదిగా తీసింది మౌనిక. ఎదురుగా మౌనిక పిన్ని లక్ష్మమ్మ కనిపించింది. ఆమెని చూస్తూనే కళ్లలో ఆప్యాయత, ప్రేమ, ఇష్టం వగైరా అన్నింటిని చూపిస్తూ "పిన్నీ" అంటూ పెదాలు కదిలించింది.

మౌనికని చూసిన లక్ష్మమ్మగారు "అదేవిటే అలా చూస్తూ ఉండిపోయావ్! ఇంతకీ ఎలా ఉన్నావ్? అల్లుడుగారు, పిల్లలు ఎలా ఉన్నారు?" అడిగిందామె లోపలికి నడిచి సోఫాలో కూలబడుతూ.

ఆ మాటలకి మౌనిక 'బాగానే ఉన్నాం' అన్నట్టు తలని అటూ ఇటూ ఆడించింది.

ఆ సైగలూ, హావభావాలూ గమనించిన లక్ష్మమ్మ గారు, కాస్త ఆశ్చర్యంగా "ఏంటే! నే వచ్చినప్పటి నుండి అలా కొండపల్లి బొమ్మలా తలాడించడం, మైమ్ ఆర్టిస్ట్‌లా సైగలు చేయడం చేస్తున్నావ్. ఏమైంది మౌనవ్రతమా, మూగనోమా అమ్మడూ" అడిగిందామె కాస్త సహజ శృతి గల స్వరంలో.

"పిన్నీ... కాస్త నెమ్మదిగా మాట్లాడు" చెప్పింది మౌనిక బహు దిగువ స్వరంతో.

"ఏవిటే అంటున్నావ్ నాకేం వినబడి చావట్లా, కాస్త గట్టిగా మాట్లాడవే అమ్మా" విసిగింది లక్ష్మమ్మ.

"గట్టిగా మాట్లాడలేను పిన్నీ. ఆయన ఇంట్లో ఉన్నారు. అంతా అర్థమయ్యేలా చెప్తాను. కాస్త ఓపిగ్గా విను" అని మౌనిక, లక్ష్మమ్మగారి చెవిలో. మరేదో చెప్పేంతలో...

"అంటే, అల్లుడుగారు నీ మీద పెత్తనం పేరుతో నిన్నసలు నోరు కూడా మెదపనివ్వడం లేదా ఏంటే" అడిగిందామె కూసింత ఆతృతగా.

మళ్లీ చెవిలో "అదేం కాదు పిన్నీ. ఆయనకి శబ్దం అంటే అస్సలు పడదు. అందుకే ఆయన ఇంట్లో ఉన్నప్పుడు నేను, పిల్లలూ కొయ్యబొమ్మల్లా ఉంటాం" నిశ్శబ్దాన్ని తూ.చ. తప్పకుండా పాటిస్తూ చెప్పిందామె గుసగుసగా.

"ఏం ఎందుకంట అల్లుడికి శబ్దమంటే అంత తంటా, ఒళ్లు మంట" అడిగింది, సారీ నసిగిందామె.

"అదంతా మీ చలువే పిన్నీ. లైబ్రేరియన్ అనీ, చాలా మంచివాడని, నోరు తెరిచి ఒక్క మాట కూడా మాట్లాడడని, అతి సాత్వికుడనీ ఆ నరుడ్ని నాకు వరుడిగా తెచ్చి కట్టబెట్టారుగా. అందుకే ఇన్నాళ్ల నుండి నాకీ మౌనవ్రతం, నిశ్శబ్ద ప్రపంచం"

"అలాగా! మరీ అంత నిశ్శబ్ద జీవంటావా?" ఆశ్చర్యంగా బుగ్గ నొక్కుకుని మరీ జాలి వ్యక్తపరిచిందామె.

"అంత నెమ్మదిగా అడుగుతావేంటి పిన్నీ. చాలా నిశ్శబ్దం. అయితే చిన్నప్పట్నుంచి ఆయన మామూలుగానే ఉండేవారట. కానీ ఆయన లైబ్రేరియన్‌గా ఉద్యోగంలో జాయిన్ అయ్యాక నిశ్శబ్దం తాలూకు విలువ తెలుసుకున్నారట. అప్పటి నుండి ఇలా. మరి అది వృత్తిపై గల అంకితభావం ముదిరో లేక ఏ పైత్యమో! అది నానాటికీ పెరిగి పెరిగి చిత్రవిచిత్ర పరిణామాలకి తెరతీస్తోంది"

"అంటే" అడిగింది లక్ష్మమ్మ అర్థం కానట్టుగా మోము పెట్టి.

"అంటే ఏముంది పిన్నీ... ఆయన ఇంట్లో ఉన్నప్పుడు కుక్కర్ కూత పెట్టకుండా మామూలు గిన్నెలోనే అన్నం వండమంటారు. అలాగే నా సెల్‌ఫోన్‌కి సైలెంట్ లేదా వైబ్రేషన్ ఆప్షన్ పెట్టమంటారు. అలాగే మొన్న వారం ఆయన బైక్‌కి ఎక్కువ సౌండ్ వస్తోందని, అది ఆఫ్ రేట్‌కి అమ్మేసి మంచి సైలెన్సర్‌తో స్మూత్ సౌండ్ వచ్చే ఓ కొత్త బైక్‌ని లోన్ పెట్టి మరీ కొన్నారు. అలాగే నిన్న వారం సీలింగ్ ఫ్యాన్ గర గరమంటోందని, దాన్ని తీయించేసి బోలెడు ఖర్చు చేసి ఏ.సి. పెట్టించారు. ఇక నేను అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు పట్టీలు మరీ శబ్దం చేస్తున్నాయంటే వాటి మువ్వలు కూడా తీసేశాను. అంతవరకెందుకు... పిల్లలకి కూడా శబ్దం చేసే బొమ్మలు కాకుండా రిమోట్‌తో పనిచేసే బొమ్మలు మాత్రమే కొని తెస్తారు. ఇంకా చోద్యం ఏమిటంటే ఏదైనా చెప్పాలంటే వీలైనంత వరకూ సైగలూ, తప్పక పోతే దగ్గరకొచ్చి దిగువ స్వరంతో చెవిలో మాత్రమే చెప్పాలంటారు. ఇలా చెప్పుకుపోతే ఓ వంద పేజీలు అవుతాయి" చెప్పిందామె స్వరంలో దిగులు ధ్వనించేలా.


"అలాగా! మరి ఏ సైకియాట్రిస్ట్‌నైనా కలవమని చెప్పొచ్చు కదమ్మా"

"అది అయింది పిన్నీ. కానీ ఆయన, ఆ మాట వింటూనే అంటే నాకు పిచ్చి అనుకుంటున్నావా? లేక నేను నిశ్శబ్దాన్ని ప్రేమించడం నీకు వెర్రిలా అనిపిస్తోందా?" అంటూ మౌనిక మరేదో చెప్పేంతలో.

"అల్లుడు గయ్యిమని అరిచాడా!"

"లేదు పిన్నీ. రౌద్రంగా కళ్లు పెట్టి నాకు దగ్గరగా వచ్చి కోపంగా నా చెవిలో చెప్పారు. అందుకే ఆ ప్రస్తావన మళ్లీ ఆయన ముందు తీసుకొచ్చే ధైర్యం చేయలేదు. ఇక ఏం చేయాలో తెలియక ఈ మౌన సంసారాన్ని ఇలా నెట్టుకొస్తున్నా" చెప్పింది మౌనిక.

"ఏం చేయాలో నాకర్థమైంది అమ్మడూ. నువ్వేం బాధపడకు. నేనున్న ఈ రెండు రోజుల్లో మీ ఆయన నిశ్శబ్ద ప్రపంచాన్ని బద్దలుకొట్టి, మౌనేన కలలో ప్రాప్తి అని నిరూపిస్తా" అందామె ఒకింత ఆలోచనలోకి జారుతూ.



మర్నాడు మధ్యాహ్నం, పడుకుని ఉన్న సైలేష్ గట్టిగా డి.టి.యస్. డాల్బీ సౌండ్ రేంజ్‌లో ఇల్లు పై కప్పు ఎగిరి పోయేలా అరిచాడు. ఆ అరుపు విన్న మౌనిక, మొదట తన భ్రమేమో అనుకుని మళ్లీ బట్టలు ఉతికే పనిలో నిమగ్నమైంది. కానీ ఆ అరుపులు ఇంకా బాబోయ్, నాయనోయ్ అని వినిపిస్తుండడంతో తన భర్త ఇన్నాళ్లకి స్వరపేటికని పూర్తి స్థాయిలో వాడాడన్న ఆనందం ఒక పక్క, మరో పక్క అతనికేమైందో అనే ఆందోళన కలిగి పరుగున సైలేష్ బెడ్‌రూంకి వెళ్లి "ఏమైందండి?" అంటూ అడిగిందామె కాస్త తత్తరపడుతూ.

ఆమె మాటలకి సైలేష్ పెద్ద స్వరంతో "చూడు, చూడు మౌనీ, నన్ను తేలు కుట్టేసింది" అంటూ భయం నిండిన కళ్లతో చచ్చిపడున్న తేలుని చూపించాడు.

దానిని చూసిన మౌనిక అమాయకంగా, "చచ్చిపోయిన తేలు మిమ్మల్నెలా కుట్టిందండీ" అడిగిందామె.


"చచ్చిన తేలు కుట్టడం కాదు. అది కుట్టిన తర్వాతే మీ పిన్నిగారు దాన్ని చెప్పుతో కొట్టి చంపేశారట"


"ఔనా పిన్నీ" అడిగింది మౌనిక, చిరుభయం నిండిన కళ్లతో లక్ష్మమ్మ వంక చూస్తూ.

"ఔనమ్మా. నేను ఇటుగా వెళుతూ కిటికీలోంచి అల్లుడిగారి బెడ్‌రూంలోకి అలవోకగా చూశా. అప్పటికే ఆ తేలు అల్లుడిగారి కుడి కాలి దగ్గర ఉంది. దాంతో నేను అల్లుడుగారూ, అల్లుడుగారూ అంటూ అరిచాను. కానీ ఆయన వినలేదు. దాంతో నేనే వచ్చి ఆ తేలుని తీద్దామనుకునేలోపు అది అల్లుడిగారిని కుట్టేసింది" చెప్పింది లక్ష్మమ్మ కాస్త దిగులు మోముతో.

ఆమె మాటలు విన్న సైలేష్ కాస్త గట్టిగా "అంతా అబద్ధం మౌనీ, ఆవిడ అసలు అరవనే అరవలేదు. ఒకవేళ అరిచి ఉంటే నాకెందుకు మెలకువ రాదు" చెప్పాడు, కాలి వంక దీనంగా చూసుకుంటూ.

ఆ మాటలకి లక్ష్మమ్మ గారు మౌనిక వంక చూస్తూ "అదేనమ్మా. మన ఇంట్లో గట్టిగా మాట్లాడకూడదు, అరవకూడదు. అలా చేస్తే అల్లుడికి నచ్చదన్నావుగా. అందుకే ఆయన ఇష్టపడే శృతిలోనే నెమ్మదిగా అరిచాను. దాంతో అల్లుడిగారికి వినబడలేదు. అంతలోనే ఈ అనర్థం జరిగిపోయింది. ఇదే కాదమ్మా నిన్న మనం శివాలయానికి వెళ్లి, అట్నుంచి అటు సూపర్ బజార్‌కి వెళ్లి, అల్లుడుగారి పర్సు పోయిందని, ఏ




షాపింగు చేయకుండా ఇంటికి తిరిగి వచ్చామా! అసలు ఆ పర్సుని ఓ దొంగవెధవ కొట్టేస్తున్నప్పుడు నేను అల్లుడుగారికి సైగల ద్వారా తెలియజేసే ప్రయత్నం చేశా. కానీ అల్లుడుగారే అర్థం చేసుకోకుండా నా వంక అదోలా చూశారు. అపార్థం గ్రా చేసుకుంటారేమోనని, నీ చెవిలో నసిగి మరీ చెప్పాను. కానీ ఆ లైట్ మ్యూజిక్ ధ్వనిలో నీకు విన్పించలేదు. దాంతో అల్లుడి పర్సు, అందులోని డబ్బూ, క్రెడిట్ కార్డులు, వగైరా అన్నీ పోయాయి. అవి పోతే పోయాయిలే. కానీ ఈ రోజు ఇదైంది. రేపు ఇంకొకటి అవుతుంది అమ్మడూ" అని సైలేష్ వంక చూస్తూ "కాబట్టి అల్లుడుగారూ, వృత్తి పట్ల అంకితభావం, ఇష్టం ఉండొచ్చు. కానీ అది అర్థం లేని పనులకీ, అనర్థాలకీ తావిచ్చే విధంగా దానిని అన్నింటికీ అన్వయించకూడదు. కాబట్టి అతి సర్వత్రా వర్జయత్ అని మీరు తప్పక గ్రహించాలి" చెప్పిందామె అనర్గళంగా.

ఆమె మాటలకి సైలేష్ కాస్త ఆలోచిస్తూ "ఔనత్తయ్యా, మీరన్నది నిజమనిపిస్తోంది. ఈ సంఘటనల ద్వాగా అది ఋజువు అయింది కూడా. కాబట్టి ఈ రోజు నుండి నిశ్శబ్దానికి చెల్లుచీటీ రాసి, సైలెన్స్‌కి లైసెన్స్ రద్దు చేసి కామోష్ అనే పదానికి నా డిక్షనరీలోంచి మోక్షం కల్పిస్తాను" చెప్పాడు సైలేష్ తేలుకుట్టిన కాలి వంక మరోసారి దిగాలుగా చూసుకుంటూ.

"పోనెండి అల్లుడుగారూ. ఇప్పటికైనా మీలో ఈ మంచి మార్పు వచ్చింది. నాకు చాలా సంతోషంగా ఉంది. అలాగే ఈ గొడవలో పడి నేను అసలు విషయం మర్చిపోయా. అదేనర్రా నేను ఈరోజు ఊరు వెళ్లడానికి గాను టికెట్ బుక్ చేయించిన ట్రావెల్ బస్‌కి టైం అవుతోంది. వస్తాను పిల్లలూ, అల్లుడుగారూ వెళ్లొస్తాను" అని తన గదిలో ఉన్న బ్యాగ్ తీసుకుని బయటికి నడిచిందామె.

గుమ్మం బయటి వరకూ ఆమెతో పాటే వచ్చిన మౌనికని, ఆప్యాయంగా చూస్తూ ఆమె చేయి అందుకుని "ఇదిగోనమ్మా అల్లుడి పర్సు. నేనున్న ఈ రెండు రోజుల్లో అల్లుడ్ని మారుస్తానని చెప్పానుగా. అందుకే నేనే నిన్న ఆ సూపర్‌బజార్‌లో అల్లుడి పర్సు తీసేసి... ఇందాక అలా చెప్పాను. అట్లాగే మీ ఆయనని తేలు కరిచిందని కంగారు పడకు. అది కూడా నా ప్లాన్‌లోని భాగమే" చెప్పిందామె.

అర్థం కానట్టుగా చూసింది మౌనిక. ఆ ఆశ్చర్యార్థం తాలూకు అసలు అర్థం గ్రహించిన లక్ష్మమ్మగారు "ఏం లేదమ్మడూ. నేను ఇందాక అటుగా వెళుతూ అల్లుడిగారి బెడ్‌రూంలోకి అలవోకగా చూశానని చెప్పానా. అప్పుడు ఓ తేలు, ఓ మూల ఉన్న కంతలోకి వెళ్లడం చూశాను. మొదట రవ్వంత కంగారు పడ్డాను. తర్వాత కాస్తంత ఆలోచనలో పడ్డాను. అంతే. మరుక్షణం ఆ తేలుని చంపి, నేనే మీ ఆయన కాలికి పిన్నీసుతో గుచ్చాను. దాంతో అల్లుడు లేవగానే తేలుని చూపించాను దానిని చూసిన అల్లుడు, భయంతో బేరుమన్నాడు. అదమ్మా జరిగింది" చెప్పిందామె తేలిగ్గా నవ్వేస్తూ.

ఆమె మాటలకి మౌనిక చెమర్చిన కళ్లతో "పిన్నీ నువ్వు చాలా గ్రేట్..." అంటూ ఆమెని గట్టిగా హత్తుకుని బుగ్గని ముద్దాడింది.

అసలు కథ తెలియని సైలేష్ యమ కంగారుగా "మౌనికా, త్వరగా రా. హాస్పిటల్‌కి వెళ్లాలి. అసలే తేలు కాటు విషం" అంటూ బిగ్గరగా అరుస్తూ కంగారులో తన పాంటుని తిరగేసి వేసుకోవడం చూసిన మౌనిక, లక్ష్మమ్మగార్లకి నవ్వాగలేదు.



## నేటితరం డ్రీమ్‌గర్ల్

అలనాటి అందాల హీరోయిన్ హేమమాలినికి 'డ్రీమ్‌గర్ల్' అనే బిరుదు వుండేది. ఆ పేరుతో ఆమె హీరోయిన్‌గా ఓ సినిమా కూడా వచ్చింది అప్పట్లో. ఇప్పుడు తన అరవయ్యవ ఏట కూడా ఇంకా అందాలభామగానే కనిపిస్తోంది హేమ. అయితే నేటి తరం హీరోయిన్లలో అలా 'డ్రీమ్‌గర్ల్' అనదగ్గ హీరోయిన్ బాలీవుడ్‌లో ఎవరైనా వున్నారనుకుంటున్నారా? అని హేమమాలిన్ని అడిగితే- 'ప్రస్తుతం అలాంటి అర్హత ఒక్క ఐశ్వర్యారాయ్‌కే వుందని నా అభిప్రాయం' అంది. ఈ మాట విన్న ఐష్ ఆనందానికి అంతేముంటుంది?